# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-10-2025 సమయం : రాత్రి 8 గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ నాలుగు రోజుల కేరళ పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సాయంత్రం తిరువనంతపురం చేరుకున్నారు.
- ❖ జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశ ప్రజలకు వేల కోట్ల రూపాయల ఆదా జరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
- ❖ బలమైన పోలీసు వ్యవస్థ.. బలమైన దేశం.. కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు.
- ❖ ప్రయాణీకుల అవసరాలకు తగినట్లుగా రైల్వే శాఖ చర్యలు తీసుకుంటోందని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు.

=====================

నాలుగు రోజుల కేరళ పర్యటన నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ సాయంత్రం తిరువనంతపురం చేరుకున్నారు. తిరువనంతపురం అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్రపతికి కేరళ రాష్ట్ర గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఇతర సీనియర్ అధికారులు ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి శబరిమల ఆలయాన్ని రేపు సందర్శించి అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుంటారు. ఈ నెల 23న కేరళలోని రాజ్ భవన్‌లో పూర్వ రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ విగ్రహాన్ని రాష్ట్రపతి ఆవిష్కరిస్తారు. తరువాత పాలాలోని సెయింట్ థామస్ కళాశాల, ఎర్నాకులంలోని సెయింట్ థెరిసా కళాశాలలో జరిగే వేర్వేరు కార్యక్రమాలకు రాష్ట్రపతి హాజరవుతారని అధికార వర్గాలు తెలిపాయి.

=====================

రెండవ తరం వస్తు సేవల పన్ను (జీఎస్టీ) సంస్కరణల ద్వారా దేశంలోని పౌరులకు వేల కోట్ల రూపాయలు ఆదా జరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. భవిష్యత్ తరం కోసం జీఎస్టీ సంస్కరణలలో భాగంగా వీటిని చేపట్టామన్నారు. ఈ మేరకు దేశ పౌరులను ఉద్దేశించి నరేంద్ర మోదీ ఈ రోజు లేఖ రాశారు. ఈ సంస్కరణలు సామాన్య, మధ్య తరగతి ప్రజల

జీవితాన్ని సులభతరం చేయడంతో పాటు ఆర్థికవృద్ధిని పెంచుతాయని అన్నారు. స్వదేశీ వస్తువులను కొనుగోలు చేయాలని ఈ సందర్భంగా దేశ ప్రజలకు ప్రధానమంత్రి విజ్ఞప్తి చేశారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారతదేశం ధర్మాన్ని పాటించడమే కాకుండా ప్రతీకారం తీర్చుకుందని గుర్తు చేశారు. ధర్మాన్ని నిలబెట్టాలని శ్రీరాముడు బోధించారని, అలాగే అన్యాయాన్ని ఎదురించడానికి ధైర్యాన్ని సైతం ఇచ్చారని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా ఇది నిరూపితమైందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

=====================

బలమైన పోలీసు వ్యవస్థ.. బలమైన దేశం.. కేంద్రప్రభుత్వ లక్ష్యమని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా న్యూఢిల్లీలోని జాతీయ పోలీసు స్మారక చిహ్నం వద్ద అమరవీరులకు ఆయన ఈ రోజు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సైన్యం, పోలీసు విభాగాలు వేరువేరు అయినా వారి లక్ష్యం మాత్రం జాతీయ భద్రతే అని అన్నారు. సైన్యం దేశాన్ని రక్షిస్తుందని.. పోలీసులు సమాజాన్ని రక్షిస్తారని తెలిపారు. 2047 నాటికి వికసిత్ భారత్ ను సాధించే నేపథ్యంలో దేశ అంతర్గత, బాహ్య భద్రతను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని రక్షణ మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

=====================

భారత నావికాదళం ద్వైవార్షిక కమాండర్ల సమావేశం న్యూఢిల్లీలో రేపు ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సమావేశంలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పాల్గొని నావికాదళ కమాండర్లను ఉద్దేశించి కీలక ప్రసంగం చేస్తారు. ఆపరేషన్ సిందూర్ తరువాత నిర్వహిస్తున్న ఈ సమావేశం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. భారత సైన్యం, వైమానిక దళం, ఇండియన్ కోస్ట్ గార్డ్ లతో సమన్వయం చేసుకోవడంతో పాటు ఉమ్మడి కార్యకలాపాలను పెంచడంపై నావికాదళం దృష్టి సారించడం వంటి వాటి మీద ఈ సమావేశాలలో చర్చిస్తారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

=====================

ప్రయాణీకుల అవసరాలకు తగిన విధంగా రైల్వే శాఖ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోందని రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌ను ఆయన ఈ రోజు సందర్శించి అక్కడ ప్రయాణీకులతో సంభాషించారు. అదే విధంగా ప్రత్యేక రైళ్ళ ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేంద్రమంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. దీపావళి పండుగ సందర్భంగా దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కోటి మందికి పైగా ప్రయాణీకులు ప్రత్యేక రైళ్లలో ప్రయాణించారని చెప్పారు. ఢిల్లీ ప్రాంతంలో సగటున ప్రతిరోజు 4.25 లక్షల మంది ప్రయాణీకులు ప్రయాణిస్తున్నారని ఆయన పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

=====================

ఢిల్లీలో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరుకుందని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు పేర్కొంది. ఢిల్లీ గాలి నాణ్యత సూచిక AQI ఈ రోజు 357 వద్ద నమోదైందని వెల్లడించింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అదే విధంగా బయటకు వచ్చినపుడు మాస్క్ లను తప్పనిసరిగా ధరించాలని సూచించింది.

=====================

జమ్మూకాశ్మీర్‌లో దాదాపు 2 వేలకు పైగా డెంగ్యూ కేసులు నమోదయ్యాయని అధికార వర్గాలు తెలిపాయి. వీటిలో జమ్మూ జిల్లాలోనే అత్యధికంగా 960 కేసులు నమోదయ్యాయని, ఆ తరువాత కథువా, సాంబా, ఉధంపూర్ లలో ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మొత్తం 20 వేల 277 పరీక్షలు నిర్వహించినట్లుగా అధికార వర్గాలు వెల్లడించాయి. దోమల ద్వారా సంక్రమించే ఈ వ్యాధి మరింత వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు ప్రజలకు సూచించారు.

=====================

ఉప రాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సి.పి. రాధాకృష్ణన్ రాజ్యసభ సచివాలయాన్ని ఈ రోజు సందర్శించారు. ఎగువ సభ సజావుగా, సమర్థవంతంగా పని చేయడంలో అధికారులు, సిబ్బంది పాత్రను ఆయన ఈ సందర్భంగా ప్రశంసించారు. పార్లమెంటరీ కార్యకలాపాలను బలోపేతం చేయడానికి సిబ్బంది అంకితభావం, వృత్తి నైపుణ్యం దోహదపడుతుందని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ... దానిని నిరంతరం కొనసాగించాలని ఆకాంక్షించారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశం-ఇజ్రాయెల్ వ్యూహాత్మక భాగస్వామ్యం రాబోయే సంవత్సరాల్లో కూడా మరింతగా అభివృద్ధి చెందుతుందని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం ద్వారా చేసిన పోస్టులో పునరుద్ఘాటించారు.

=====================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో తమిళనాడు తీర ప్రాంతంలో మరో నాలుగు రోజులు పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది. దీని ప్రభావంతో ఈ నెల 24వ తేదీ వరకూ భారీ వర్షాలు తమిళనాడుతో పాటు దక్షిణ ఆంధ్రప్రదేశ్ లో కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. అదే విధంగా దక్షిణ బంగాళాఖాతం మధ్య ప్రాంతాలు దానికి ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఆ వివరాలను వాతావరణ శాస్త్రవేత్త ఉమాశంకర్ దాస్ తెలియచేస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

=====================

దీపావళి సందర్భంగా స్టాక్ ఎక్స్చేంజీలు 'మూరత్ ట్రేడింగ్ (Muhurat Trading)' పేరిట ఏటా ప్రత్యేక సెషన్ నిర్వహిస్తుంటాయి. ఈరోజు సంవత్ 2082 పేరుతో గంట పాటు మూరత్ ట్రేడింగ్ జరిగింది. ఈ ప్రత్యేక సెషన్‌లో సూచీలు స్వల్పంగా లాభపడ్డాయి. ఈ మధ్యాహ్నం 1.45 గంటలకు ట్రేడింగ్ ప్రారంభమై.. 2.45 గంటలకు పూర్తయ్యింది. సెన్సెక్స్ 84,363 పాయింట్ల వద్ద ప్రారంభమై.. చివరికి 63 పాయింట్ల లాభంతో 84,426 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 25 పాయింట్లు పెరిగి 25,868 వద్ద ముగిసింది.

=====================

=====================